

## నిమ్స్ వైద్యురాలికి ఉత్తమ అవార్డు

కుష్టు వ్యాధి నివారణ కోసం నిమ్స్ దవాఖాన డెర్మటాలజీ వైద్యురాలు ఆసియాబేగం చేసిన కృషిని అభినందిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఆమెను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు. యాంటీ లెప్రసీ డే సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ వైద్యురాలు ప్రశంసాపత్రాన్ని ఆమెకు బుధవారం డీఎంహెచ్‌వో నిర్మల ప్రభావతి అందజేశారు. ఈ సందర్భంగా ఆసియా బేగంను నిమ్స్ డైరెక్టర్ బీరప్ప అభినందించారు.

– ఖైరతాబాద్, జనవరి 31

## చేనేత పరిశ్రమను ఆదుకోవాలి

హిమాయత్‌నగర్,జనవరి 31: రాష్ట్రంలోని చేనేత పరిశ్రమను కాపాడేందుకు బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం తర్వాత రెండో ఉపాధి రంగమైన చేనేత పరిశ్రమను రక్షించడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. చేనేత రంగం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై విధించిన జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# 111 జీవో పరిధిలో 9 అంతస్తులా?

**అక్రమ నిర్మాణాలపై అధికారుల ఆగ్రహం**

- గొలిదొడ్డి నిర్మాణాలను చూసి అవాక్కైన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- అక్రమాలెన్ని, సక్రమాలెన్ని అంటూ ప్రశ్నల వర్షం
- ఎన్నింటికి నోటీసులు ఇచ్చారంటూ ప్రశ్నించిన మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ నర్సింహా రెడ్డి

మణికొండ, జనవరి 31: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గొలిదొడ్డిలో అక్రమ నిర్మాణాలను చూసి మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ అవాక్కయ్యారు. బుధవారం ఆయన గొలిదొడ్డిలోని పద్మశ్రీ, సాయితులసీ, వివేకానంద నగర్ కాలనీల్లో అక్రమ నిర్మాణాలను అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గొలిదొడ్డిలోని జీవో 111 పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో జీప్లస్ 8,9 అంతస్తులు ఏ విధంగా వెలిశాయంటూ స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులను ఆయన ప్రశ్నించారు. ఇంత భారీ సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే మున్సిపల్ శాఖ, టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ప్రశ్నించారు. పుట్టగొడుగుల్లా వెలిసిన ఈ నిర్మాణాల్లో ఏవైనా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే సంభవించే నష్టాలను ఎవరు భరిస్తారు? బాధ్యులు ఎవరని రీజనల్ డైరెక్టర్ నర్సింహా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ నుంచి ఇప్పటి వరకు ఎంత మందికి నోటీసులు జారీ చేశారు, ఎన్ని అక్రమాలను గుర్తించారు.. ఎన్నింటిని కూల్చారనే వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని నార్సింగి టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే సాయితులసీ కాలనీలో అక్రమాలకు నిలయాలుగా మారిన ఈ అపార్ట్‌మెంట్‌లో కూల్చివేతలు చేపట్టేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. వివేకానంద కాలనీలో కనీసం సెట్ బ్యాక్ లేకుండా 60 గజాల్లో ఆరు అంతస్తుల నిర్మాణాలు ఏ విధంగా జరిగాయని ఇందుకు మున్సిపల్ శాఖ అధికార యంత్రాంగం బాధ్యత వహించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు కేసుల విషయమై న్యాయస్థానానికి రికార్డులు సమర్పించాల్సి ఉండటంతో అత్యవసరంగా అక్కడి నుంచి అధికారులు నార్సింగి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. మరోసారి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సత్యభామ, నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, టీపీవో భాగ్య, టీపీఎస్ మణిహారిక తదితరులు పాల్గొన్నారు.



గొలిదొడ్డిలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులు





కాచారం గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్వాక్రా భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, సర్పంచ్ రాంగోపాల్ తదితరులు

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, జనవరి 31: గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. బుధవారం శంషాబాద్ మండలంలోని చౌదర్‌గూడ గ్రామంలో బీసీ కమ్యూనిటి హాల్, కాచారం గ్రామంలో డ్వాక్రా భవనాన్ని ప్రారంభించారు. అలాగే రషీద్‌గూడ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలికవసతులకు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో శంషాబాద్ మండలానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అవసరమైన నిధులు కేటాయించి 15 ఏండ్లుగా అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. చౌదర్‌గూడ గ్రామంలో రూ.15 లక్షలతో బీసీ కమ్యూనిటీహాల్‌ను నిర్మించామని చెప్పారు. అలాగే కాచారం గ్రామంలో డ్వాక్రా భవనం లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ రాంగోపాల్ తమ దృష్టికి తీసుకురావడంతో.. వెంటనే నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. రషీద్‌గూడ గ్రామంలో రూ.10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు, వైస్ ఎంపీపీ నీలంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి, సర్పంచులు రాంగోపాల్, రాజ్‌కుమార్, ఇస్తారి, రమేశ్ యాదవ్, రాజుముదిరాజ్, ఎంపీటీసీలు గౌతమిఅశోక్, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వసంతలక్ష్మి, నాయకులు కొమ్మగోపాల్, మల్లేశ్ యాదవ్, రాజ్‌కుమార్, భిక్షపతి, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రావు, నజీర్ ఖాన్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## యువత జాగ్రత్తగా ఉండాలి

శంషాబాద్ రూరల్, జనవరి 31: మత్తు పదార్థాల పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు సూచించారు. బుధవారం శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామ పరిధిలోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శంషాబాద్ సీఐ శ్రీనాథ్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ రాంచందర్‌రావు హాజరై మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాల పట్ల జాగ్రత్తగా ఉండి, జీవితానికి బంగారుబాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఉన్నతస్థాయికి రావాలని విద్యార్థులను కళాశాలకు పంపుతున్నారని తెలిపారు. చదువుపై దృష్టి పెట్టి మీ తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు ఏ మాత్రం అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీఐ శ్రీనాథ్, ఎస్ఐ రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్కారు దవాఖాన సిబ్బందికి అవార్డులు





అధికారి నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ అనురాధ, ఆశ వర్కర్ నందిని

ఎర్రగడ్డ, జనవరి 31: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జనవరి 30నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బోరబండ స్వరాజ్‌నగర్‌లోని వినాయకనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుభాన్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్న వైద్యులు, సిబ్బంది, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, జిల్లా కుష్టువ్యాధి నివారణాధికారి డాక్టర్ నిర్మలా ప్రభావతి అవార్డులు అందుకున్నారని వెల్లడించారు. అలాగే శ్రీరాంనగర్ క్లస్టర్ ఎస్పీహెచ్ఓ డాక్టర్ తన్నీరు అనురాధ, స్వరాజ్‌నగర్ దవాఖానకు చెందిన ఆశ వర్కర్ నందిని అవార్డులు అందుకోగా, ఏఎన్ఎంలకు ప్రశంసాపత్రాలు, ఆశ వర్కర్లకు నగదు ప్రోత్సాహకాలను అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ వద్ద అవార్డుల ప్రదాన కార్యక్రమంలో చేశారు.

## రిటైల్ ఇన్వెస్టర్లకు న్యాయం చేయండి

ఖైరతాబాద్, జనవరి 31 : పెట్టుబడులు పెట్టి ఇబ్బందులకు గరవుతున్న రిటైల్ ఇన్వెస్టర్లకు న్యాయం చేయాలని రిటైల్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏండ్ల కింద స్థాపించిన యూవీఎస్ఎల్ అనే సంస్థలో సుమారు రెండు లక్షల మంది చిరు పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. అయితే 2020లో ఆ సంస్థ ఇతరుల చేతుల్లోకి వెళ్లడంతో చట్ట విరుద్ధంగా తమ నుంచి మరిన్ని పెట్టుబడులు స్వీకరించారని తెలిపారు. ప్రధాని కార్యాలయంలో పాటు సీబీఐ, మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్, సెబీలకు ఫిర్యాదు చేశామని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్



బిల్‌కలెక్టర్లతో సమావేశమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

## ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

బండ్లగూడ, జనవరి 31 : ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర బిల్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన బిల్ కలెక్టర్లతో ఆస్తిపన్ను, ట్రేడ్‌లైసెన్స్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆస్తి పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ట్రేడ్ లెసెన్స్‌లను రెన్యువల్ చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పన్నుల వసూళ్లలో పలు సూచనలు జారీ చేశారు.

## నేటి నుంచి ఆస్తి పన్నుపై 2 శాతం వడ్డీ..

జూబ్లీహిల్స్,జనవరి31: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆస్తిపన్ను వసూలును అధికారులు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఏడాది 2023–24లో చెల్లించాల్సిన గడువు బుధవారంతో ముగియడంతో ట్యాక్స్ పేయర్స్‌కు ఆస్తిపన్నుపై అదనంగా మరో 2 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లో యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్లలో అధికారులు ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. ఈ మేరకు మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించాలని డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం ఏఎంసీ కమల్, ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్ బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఆస్తిపన్ను వసూలుకు బృందాలుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.




## గురుకులాల్లో నాణ్యమైన విద్యాబోధన

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన వసతులు, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన అందిస్తున్నామని రాష్ట్ర గురుకుల పాఠశాలల హైదరాబాద్ రీజనల్ లెవల్ కో ఆర్డినేటర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం నందనవనంలోని జూబ్లీహిల్స్ తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల బాలుర–1 లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాల కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హఫీజ్‌బాబానగర్‌లో ప్రచారం నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైళ్ల ప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

- జూబ్లీహిల్స్, జనవరి 31

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శంషాబాద్ రూరల్, జనవరి 31: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ రాజు సూచించారు. బుధవారం శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవరెడ్డి, ఎస్సైలు రామకృష్ణ, శ్రీనివాస్, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మినీ టిప్పర్లను అనుమతించాలి

**ఆందోళనకు దిగిన డ్రైవర్స్**

బంజారాహిల్స్,జనవరి 31: భవన నిర్మాణరంగంపై ఆధారపడిన మినీ టిప్పర్లను రద్దీ తక్కువ ఉండే సమయంలో పగటిపూట నగరంలోకి అనుమతించాలని బంజారాహిల్స్ టిప్పర్ లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం గ్రేటర్ వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని దేవరకొండ నగర్, బీఎన్ఆర్ హిల్స్‌కు చెందిన మినీ టిప్పర్ ఓనర్లు, డ్రైవర్లు ఆందోళన చేశారు. గతంలో నిర్మాణ వ్యర్థాలు, నిర్మాణ సామగ్రి తరలించే మినీ టిప్పర్లను ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు, రాత్రి మొత్తం అనుమతించేవారన్నారు. అయితే ఇటీవల పగటిపూట నగరంలో ఎక్కడా తిరగవద్దని అధికారులు నిబంధన పెట్టడంతో వందలాది మంది డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ సాబెర్ పేర్కొన్నారు. అధికారులు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోకుంటే సమ్మె చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గిరి, నసీరుద్దీన్, నరేశ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ నగర్‌లో ఆందోళన నిర్వహిస్తున్న మినీ టిప్పర్ డ్రైవర్లు, యజమానులు



బహుమతులు గెల్చుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ రఘువీర్

## ఐఐఎంసీ కళాశాలలో టాలెంట్ టెస్ట్

ఖైరతాబాద్, జనవరి 31 : ఖైరతాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, విభాగం, అశోక్ స్కూల్ ఆఫ్ బిజినెస్, అంబిషన్స్ కెరీర్స్ కౌన్సిలర్స్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్ కళాశాలలో మేనేజ్‌మెంట్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 కళాశాలల నుంచి 820 మంది విద్యార్థులు పాలుపంచుకున్నారు. వంద ప్రశ్నలతో 90 నిమిషాల పాటు నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ.4వేలు విశ్వతేజ్ (బద్రుక కళాశాల), ద్వితీయ బహుమతి రూ.3వేలు, శ్రీలక్ష్మి (ఐఐఎంసీ కళాశాల), తృతీయ బహుమతి రూ.2వేలు గిరీష్ (బద్రుక కళాశాల)తో పాటు తొమ్మిది మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కూర రఘువీర్ ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు.

## విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 31: విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకొని ఉత్తమ పరిశోధనలతో ముందుకు సాగాలని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఈఈఈ, ఈసీఈ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌గ్రేడ్ కావాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుంటూ మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి సంరెడ్డి ధనుంజయ్ రెడ్డి, సీటీవో ఆఫ్ ది ఎంవోఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ శ్రీకాంత్ సంగం, కన్వీనర్ శ్రీజ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సురేశ్ కుమార్, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ జి.ప్రేమ్ కుమార్‌రెడ్డి, ఈఈఈ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.సుధాకరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లకు సమాంతరంగా.. ఐరన్ గ్రిల్స్

జూబ్లీహిల్స్, జనవరి31: జీహెచ్ఎంసీ అధికారులు 19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్‌లో రోడ్లకు సమాంతరంగా మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సిమెంట్ మ్యాన్‌హోల్స్‌పై కొత్తగా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వీటితో వరద ప్రవాహం సులువుగా స్టామ్ వాటర్ డ్రైన్‌లలోకి చేరుతుందని ఈఈ రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో న్యాక్ ఏఈ వెంకటేశ్ ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు పనులను సిబ్బందితో కలిసి చేపట్టారు.



## సర్టిఫికెట్ ప్రదానం..

జూబ్లీహిల్స్,జనవరి31: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సతీశ్ రెడ్డి కన్స్యూమర్ యాక్టివిస్ట్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రయ్య, నేషనల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతి పాండే, రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డితో కలిసి ఆయనకు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు.



## ట్రాలీ బోల్తా..

**డ్రైవర్‌కు స్వల్ప గాయాలు**

ఎర్రగడ్డ, జనవరి 31: మినీ ట్రాలీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. బుధవారం మధ్యాహ్నం ఎస్పీఆర్ హిల్స్ నుంచి గాయత్రి హిల్స్ వైపునకు వెళ్తున్న మినీ ట్రాలీ అదుపు తప్పి పల్టీ కొట్టింది. అటుగా వెళ్తున్న స్థానికులు అక్కడికి వెళ్లి డ్రైవరును బయటకు తీశారు. అతడికి స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుకు అడ్డం గా పడి ఉన్న ట్రాలీని తొలగింపజేసి వాహనాల రాకపోకలు సజావుగా జరిగేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

## కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 31: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన ధర్మేంద్ర, రేణుదేవి(29) భార్యాభర్తలు. బతుకుదెరువు కోసం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని లక్ష్మిగూడలో ఉంటున్నారు. ధర్మేంద్ర ఇటీవల రెండో వివాహం చేసుకున్నాడు. తాను ఉండగానే భర్త ధర్మేంద్ర రెండో వివాహం చేసుకోవడంతో ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. తన భర్త తనకు కాకుండా పోతున్నాడని తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 31: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆప్కో కాలనీలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఆర్ఐ సునీతామహేందర్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు, సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆప్కో కాలనీలోని సర్వేనంబర్ 156/1 స్థలం డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణం కోసం కేటాయించబడిందని తెలిపారు. ఈ స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలువడంతో వెంటనే కూల్చివేతలు చేపట్టామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరోసారి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.